# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 232 | విశాఖపట్నం | 23-5-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 232 | VISAKHAPATNAM | 23-5-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-


Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram







## ఎండలు, వడగాలుల తీవ్రతపై
# చంద్రబాబు సమీక్ష



**అమరావతి, పతాకం న్యూస్:** ఎండలు, వడగాలుల తీవ్రతపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. టెంట్లు, చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ఇచ్చేలా చూడాలన్నారు. తీవ్ర ఉష్ణోగ్రత ఉన్నచోట్ల సెలవులు ప్రకటించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తాగునీటి సరఫరాకు ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఎండలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్లకు సీఎం నిర్దేశించారు. సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




## రూ.3 వేల కోట్ల ఎస్ఏఈఎల్ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించిన లోకేష్

6లో

# ఉప్పాక చెరువుకు మహర్దశ



**అనకాపల్లి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ విజయ్ క్రిష్ణన్ ముందు చూపుతో గ్రామీణ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి, సాగు నీటి సదుపాయాల పెంపు, రైతుల సంక్షేమం కోసం, జలధార జలహారతి పథకంను విస్తృతంగా అమలు చేస్తోంది. ఈ పథకం గొలుగొండ మండలం పప్పు శెట్టిపాలెం గ్రామపంచాయతీ ఉప్మాక చెరువు రూ. 20 లక్షలు అంచనా వ్యయంతో పనులకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేయడం అనేది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. ముఖ్యంగా పూడికతీత, గట్లు పునర్నిర్మాణము పనులు ఇంత పెద్ద ఎత్తున గొలుగొండ మండలం పప్పు శెట్టి పాలెం పంచాయితీలో చేపడుతున్న పూడికతీత పనులతో ప్రతి చెరువు నిండుకుండలా జల కళను సంతరించుకుంటుంది. ఈ పనుల ద్వారా 200 ఎకరాలకు ఆయకట్టు సాగు నీటి లబ్ధి చేకూరుతుంది. గొలుగొండ మండలం పప్పు శెట్టిపాలెం గ్రామ పంచాయతీ నందు ఉప్పాక చెరువు పూడికతీత తోపాటు గట్లు పునర్నిర్మాణముపనులకు రూ. 20 లక్షలతో చేపట్టారు. 332 మంది ఉపాధి హామీ వేతనదారులతో10 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు పూడికతీత గట్లు పునర్నిర్మాణ పనులను చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు కాలువ ద్వారా చెరువుకు చేరనుంది. తద్వారా ఈ పంచాయతీతో పాటు పరిసర ప్రాంతాల గ్రామ పంచాయతీ లోని పంట భూములకు సాగునీరు కూడా అందనుంది. ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, వరి కూరగాయల పంటలకు నీరు సంవృద్ధిగా లభించనుంది. ఈ చెరువు పరిధిలో సుమారు 200 ఎకరాలకు ఆయకట్టుకు నీరు అందడంతో పాటు గణనీయంగా బోర్లు, బావులలో భూగర్భ జలాలు పెరగనుంది. జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా ఈ చెరువును పునరుద్దించడం వలన చెరువుకు నీరు రావడంతో పాటు పశువులకు త్రాగు నీరు సమృద్ధిగా లభించడం, బోర్లు రీఛార్జ్ కావడం జరుగుతుందన్నారు. అదే విధంగా పంట పొలాలకు సాగు చేసుకోవడానికి సాగునీటి కొరత లేకుండా ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. 332 మంది తో ఉపాధి హామీ పథకం ద్వారా జలధార- జలహారతి పనులు చేపట్టడం వలన ప్రతి కుటుంబానికి ఉపాధి దొరకడంతో పాటు వలసలు వెళ్ళే పరిస్థితి కనుమరుగైంది. ఈ పనుల ద్వారా జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సుమారు అదనంగా రూ. 30 వేలు వరకు ఆదాయం కలుగుతోందన్నారు. ఈ పనులు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేయుచున్నారు. ఈ కార్యక్రమం వల్ల వలసలు తగ్గి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది. రైతులు మామిడి, వరి, కూరగాయల సాగుతో పాటు నీటి కొరత లేకుండా సంతోషంగా సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు.



5లో

## వంశధార వంతెనకు మోక్షం!

## కాక్రోచ్ జనతా పార్టీ విదేశీ శక్తుల కుట్ర?
### దర్యాప్తు చేస్తున్న ఇంటెలిజెన్స్




2లో



6లో

## కీళ్ల నొప్పులకు అసలు కారణాలేంటి..?

## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ‘తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?’ అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని ‘క్రీమీలేయర్’ (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ (తరువాయి 2వ పేజీలో)

## అనంతపురం జిల్లాలో
# గోల్డ్ మైన్స్ గుర్తింపు: కొల్లు



**కర్నూలు, పతాకం న్యూస్:** గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడి పెట్టాలంటే ఎవరు రాలేని పరిస్థితి ఉండేదని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు పోటీపడి ముందుకు వస్తున్నారన్నారు. శుక్రవారం తుగ్గలి మండలం జొన్నగిరిలో టీడీపీ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే మైనింగ్ శాఖలో రూ. 4 వేల కోట్లు అధికంగా రాబడి వచ్చిందని తెలిపారు. చంద్రబాబు నాయుడు పరిపాలన విధానాన్ని చూసి భారత దేశంలో వచ్చిన పెట్టుబడులలో 25% ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయని అన్నారు. జొన్నగిరిలో జియో మైసూర్ (తరువాయి 2వ పేజీలో)



## ఎండ వేడికి తట్టుకోలేక ప్రతిరోజు లక్షలాది కోళ్లు మృత్యువాత

5లో

## రాష్ట్రంలో 2.5 కోట్ల సీడ్ బాల్స్ పంపిణీ లక్ష్యంగా ఏర్పాట్లు: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా 2.5 కోట్ల విత్తనబంతుల పంపిణీకి అటవీశాఖ సన్నాహాలు చేస్తు న్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ తెలిపారు. విత్తనబంతుల తయారీ, పంపిణీ మహాయజ్ఞంలా చేయనున్నట్లు ఆయన వివరించారు. జీవవైవిధ్యం, పర్యావరణ స్థిరత్వమే లక్ష్యంగా హరిత సమరం చేస్తున్నమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చదనం పెంచడమే లక్ష్యమని, జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతుల తయారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నేతలు, డ్వాక్రా మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత ఇందులో పాల్గొంటారన్నారు. సీడ్ బాల్స్ చల్లేందుకు డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ‘జీవించే హక్కు’

నేరం రుజువయ్యేవరకు ప్రతి నిందితుడూ నిర్దోషే అన్నది సహజ న్యాయసూత్రం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 నిర్దేశం ప్రకారం... ప్రతి పౌరుడికీ జీవించే హక్కు ఉంది. దానిని అకారణంగా కానీ, ఏ కారణంగానైనా కానీ నిర్దాక్షిణ్యంగా హరించడం న్యాయసూత్రాలకు విరుద్ధం. కానీ, దేశంలో వివిధ కేసుల్లో 5 లక్షల 30 వేల మందికి పైగా జైళ్లలో ఉంటే, అందులో 75 శాతం మంది నేరం రుజువు కాకుండానే అప్రకటిత కారాగార శిక్ష అనుభవించాల్సి రావడం విచారకరం. విచారణలో తీవ్రమైన జాప్యం, న్యాయాన్ని పొందలేని నిందితుల కుటుంబ నేపథ్యం, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పాలకుల నిరంకుశ, ప్రతీకార భావన- అనేకమంది ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిపోవడానికి కారణమవుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ విలువలకూ, సహజ న్యాయసూత్రాలకూ తీవ్రమైన విఘాతం కలిగిస్తోంది. 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు ఉమర్ ఖలీద్‌ను ఉపా చట్టం కింద అరెస్టు చేసి ఐదేళ్లు దాటుతోంది. ఇంతవరకూ విచారణ ప్రారంభం కాలేదు. ఛార్జిషీట్ దాఖలు ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది. మధ్యలో బెయిల్ కోసం అనేకసార్లు ప్రయత్నించినా కోర్టులు నిరాకరిస్తున్నాయి. ‘భారీ కుట్ర’ అంటూ దర్యాప్తు సంస్థలు బనాయించిన ఆరోపణలనే ప్రాథమిక ఆధారంగా పరిగణించి, బెయిల్ ఇవ్వటానికి నిరాకరించడం రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తోంది. ఏళ్ల తరబడిన నిర్బంధం తరువాత నిందితులపై నేరం రుజువు కాకపోతే- వారు కోల్పోయిన జీవితాన్ని ఎలా తిరిగి ఇస్తారన్న ప్రశ్న కూడా చాలా విలువైనది. బ్రిటీషు పాలకులు భారత పౌరులపై ప్రయోగించిన నిర్బంధ, నిరంకుశ చట్టాలకు గంపగుత్త రూపం ఉపా. ఈ చట్టంలోని సెక్షన్ 43డి (5) ప్రకారం- దర్యాప్తు సంస్థ చూపించిన ప్రారంభ ఆధారాలనే నిజమన్నట్టు కోర్టులు భావించి, నిందితులకు బెయిల్ ఇవ్వకూడదనేది అత్యంత కఠినమైన నిబంధన. పూర్తి విచారణ జరపకుండానే ఎన్నేళ్లయినా జైలులో బంధించడం పట్ల అనేకమంది న్యాయనిపుణులు, ప్రజాస్వామ్యవాదులు మొదటినుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. మత ప్రాతిపదికన పౌరసత్వ చట్ట సవరణ తీసుకురావటాన్ని దేశంలో అనేకమంది వ్యతిరేకించగా, ఉమర్ ఖలీద్ వంటి వారూ నిరసన ఉద్యమంలో పాల్గొన్నారు. అది రాజ్యాంగబద్ధమైన హక్కు. అదెలా భారీ కుట్ర, దేశద్రోహమూ అయిందో దర్యాప్తు సంస్థలు ఇంతవరకూ ఒక్క రుజువూ చూపలేదు. అయినప్పటికీ పదేపదే బెయిల్ నిరాకరణ కొనసాగుతోంది. ఉపా లాంటి కేసుల్లో సైతం నిందితులను ఏళ్ల తరబడి నిర్బంధించడం సరైంది కాదని, అక్కడ కూడా బెయిల్ పొందటాన్ని హక్కుగా భావించాల్సి ఉంటుందని ఐదు రోజుల క్రితం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న వ్యాఖ్యానించడం- ఈ అంశానికి ఉన్న ప్రాధాన్యాన్ని ముందుకు తెస్తోంది. 2019-2023 మధ్య ఉపా చట్టం కింద 10,440 మందిని అరెస్టు చేసి జైళ్లలో ఉంచితే, ఇంతవరకూ విచారించి దోషులుగా తేల్చింది కేవలం 335 మందినే! మిగతా వారంతా కేవలం ఆరోపణలతోనే కారాగారాల్లో మగ్గుతున్నారు. ఇందులో మోడీ--అమిత్ షా హయాంలోని బిజెపి ప్రభుత్వం దురుద్దేశపూరితంగా బనాయించిన కేసులే ఎక్కువన్నది బహిరంగ రహస్యం. మోడీ రాజకీయ, పాలనాపరమైన విధానాలను ప్రశ్నించటమే దేశద్రోహమన్న తీరులో చట్టాలను దుర్వినియోగం చేయడం, దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు. మానవీయ విలువలకు తలవొంపు. ఇక సాధారణ కేసుల్లో కూడా లక్షలాది మంది సామాన్యులు విచారణ, బెయిళ్లు లేకుండానే చీకటి జైళ్లలో కునారిల్లిపోతున్నారు. ఇందులో దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల వారే అత్యధికంగా ఉండడం గమనార్హం. విశాఖ ఏజెన్సీలోని వందలాది మంది ఆదివాసీలు గంజాయి కేసుల్లో ఇరికించబడి, విచారణ లేకుండానే కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. న్యాయ సహాయం అందకపోవడం, పెద్దఎత్తున ధనరూపంలో పూచీకత్తులు చెల్లించే ఆర్థిక స్తోమత లేకపోవడం వారి విలువైన జీవితాన్ని జైలు గోడలకే పరిమితం చేస్తోంది. రాజ్యాంగ సూత్రాలూ, న్యాయ సుభాషితాలూ మాటలకే పరిమితం కావడం వల్ల ప్రయోజనం లేదు. పాలకుల కక్షకు, రాజకీయ దురుద్దేశాలకూ చట్టాలూ, న్యాయవ్యవస్థ ఉపకరణాలు కాకూడదు. అందుకే న్యాయవ్యవస్థ పౌరుల రాజ్యాంగబద్ధ హక్కులను కాపాడే నిబద్ధతతో వ్యవహరించాలి. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్నట్టు -- “రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దాన్ని అమలు చేసే మనుషుల మీదే దాని జయాపజయాలు ఆధారపడి ఉంటాయి.

## ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** ఈవీఎం గోడౌన్ వద్ద సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్ ను నెలవారీ తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉదయం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి, భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. తనిఖీ క్రమంలో లాగ్ బుక్ లో సంతకం చేశారు. భద్రతా ప్రమాణాలు, లాగ్ బుక్ నిర్వహణ ఇతర అంశాలపై అధికారులు మరియు నేతలతో మాట్లాడారు. భద్రపరిచిన ఈవీఎంల స్థితిగతులను జిల్లా కలెక్టర్ కు ఎన్నికల విభాగం అధికారులు వివరించారు. నెలవారీ సమావేశాలలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం ఉదయం డిఆర్ఓ వై. సత్యనారాయణ రావు తన చాంబరులో ఎన్నికల జాబితా నవీకరణ ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలన్నీ ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు విషయంలో బూత్ లెవల్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేని శుద్ధమైన ఓటర్లజాబితా తయారీలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ వై సత్యనారాయణ రావు, ఆర్డిఓ ఆయేషా, జిల్లా ఫైర్ ఆఫీసర్, టి.డి.పి నుండి బి.శ్రీనివాసరావు, ఏ ఏ పి నుండి కే హరినాథ్ బాబు, బీఎస్పీ నుండి ఎస్.వి.వి.రామచంద్రరావు, వైయస్సార్సీపి నుండి పి.గోవింద, సిపిఎం నుండి శ్రీరామ్, స్థానిక రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్ ఇండ్లలో ఏసీబీ సోదాలు...భారీ ఆస్తులు గుర్తింపు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ నివాసాల్లో ఎసిబి సోదాలు నిర్వహించింది. ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసి ఆయనకు చెందిన ఎనిమిది ప్రాంతాల్లో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. తనిఖీలో వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అధికారులు గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన వంశీమోహన్ పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అబ్దుల్లాపూర్ మెట్, పిగ్లీపురంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసినట్లు ఆరోపణలున్నాయి. భూములను తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ తర్వాత రియల్టర్లకు ధారాదత్తం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఒక రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్లు ఎసిబి గుర్తించింది. దీంతో అధికారులు ఆదాయానికి మించి ఆస్తుల కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కాక్రోచ్ జనతా పార్టీ విదేశీ శక్తుల కుట్ర?
### దర్యాప్తు చేస్తున్న ఇంటెలిజెన్స్




**న్యూఢిల్లీ, అక్షరప్రభ:** సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ‘కాక్రోచ్ జనతా పార్టీ’ విదేశీ శక్తుల కుట్రంటూ భారత భద్రతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దేశంలో నిరుద్యోగ యువత అసంతృప్తిని ఆసరాగా చేసుకుని అశాంతిని సృష్టించేందుకు వ్యూహం పన్నారనే కోణంలో ఇంటెలిజెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. సోషల్ మీడియాలో అతి తక్కువ సమయంలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్స్ రావడంపైనా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని వెనుక విదేశీ శక్తుల ప్రమేయం ఉందేమోనని భావిస్తూ ఆరా తీస్తున్నారు. న్యాయవ్యవస్థపై ఆర్టీఐ యాక్టివిస్టుల తీరును తప్పుబడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వారిని బొద్దింకలతో పోల్చుతూ సీజేఐ ఘాటుగా స్పందించారు. సీజేఐ సూర్యకాంత్ తీరుకు నిరసనగా సోషల్ మీడియాలో కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో వ్యంగ్యాత్మక ఉద్యమం పుట్టుకొచ్చింది. కేవలం 5 రోజుల్లోనే సీజేపీ ఇన్‌స్టాగ్రామ్ పేజీని 1.5 కోట్ల ఫాలోవర్సు దాటేశారు. అధికార బీజేపీ ఫాలోయింగ్‌నీ సీజేపీ దాటేయడం చర్చనీయాంశమైంది. నిరుద్యోగం, నీట్ పేపర్ లీకేజీలు, ఆర్థిక ఇబ్బందులపై జెన్-జీ యువత డిజిటల్ ప్లాట్ ఫామ్స్ వేదికగా ఉద్యమానికి దిగారు.

అయితే, ఒకే తరహా హ్యాష్‌ట్యాగ్‌లు, ఏఐ సాంగ్స్, సింక్రనైజ్డ్ పోస్టుల వెనుక డీప్ స్టేట్ ఐటీ సెల్స్ హస్తం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మేరకు భద్రతా కారణాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో భారతదేశంలో సీజేపీ అధికారిక ఎక్స్ ఖాతాను నిలిపివేశారు. అయితే, యువత వ్యంగ్య నిరసనను అణచివేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అందుకే ‘దేశ వ్యతిరేక’ ముద్ర వేస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ప్రతిపక్ష నేతలు, విమర్శకులు మండిపడుతున్నారు.

## నరసరావుపేట యాత్రికుల బస్సుకు ప్రమాదం



**పల్నాడు, పతాకం న్యూస్:** ఉత్తరప్రదేశ్‌లో నరసరావుపేటకు చెందిన యాత్రికులతో వెళుతున్న పర్యాటక బస్సు శుక్రవారం ఉదయం ప్రమాదానికి గురైంది. నైమిశారణ్యం నుంచి అయోధ్యకు బయలుదేరిన బస్సు నైమిశారణ్యం దాటిన సుమారు 10 కిలో మీటర్ల దూరంలో ప్రమాదానికి గురైంది. బస్సులో ఉన్న సుమారు 50 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడటంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. యాత్రికులు ఈ నెల 20వ తేదీ రాత్రి నరసరావుపేట నుంచి బయలుదేరి గురువారం లక్నోకు చేరుకున్నారు. అక్కడి నుంచి నైమిశారణ్యం దర్శించుకుని ఈరోజు ఉదయం అయోధ్యకు బయలుదేరారు. అనంతరం నేపాల్ కు వెళ్లాల్సి ఉండగా మార్గమధ్యంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో టూరిస్ట్ గైడ్ మృతి చెందగా డ్రైవర్ కాలు విరిగింది. డ్రైవర్ కు తీవ్ర గాయాలపాలై పరిస్థితి విషమంగా ఉన్నట్లు కోటేశ్వరరావు మాష్టారు తెలిపారు. పర్యటనకు వెళ్లిన ఉపాధ్యాయులలో ఎవరికీ ప్రాణాపాయం లేదని, అందరూ క్షేమంగానే ఉన్నారని నరసరావుపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కట్టా కోటేశ్వరరావు తెలిపారు. ప్రమాదం అనంతరం స్థానికులు సహాయక చర్యలు చేపట్టి ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

## పోలవరం ప్రాజెక్టులో జలవనరుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పర్యటన



**ఏలూరు, పతాకం న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ పోలవరం ప్రాజెక్టులో శుక్రవారం పర్యటించారు. గురువారం రాత్రి పోలవరం ప్రాజెక్ట్ అతిథి గృహంలో బస చేసిన ఆయన ఉదయాన్నే పర్యటన ప్రారంభించారు. పోలవరం ప్రాజెక్ట్ స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాములు, డయాఫ్రమ్ వాల్, ఫిష్ లాడెర్ మొదలైన వాటిని పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ పనులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్ జల విద్యుత్ కేంద్రం పనుల పురోగతిని పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్ట్, జల విద్యుత్ కేంద్రం పనుల పురోగతి తదితర అంశాలపై శశిభూషణ్ కుమార్ సమీక్షించనున్నారు. కొద్ది రోజుల క్రితం శశిభూషణ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. శశిభూషణ్ వెంట పర్యటనలో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సి ఈ ఓ సంజీవ్ వోహ్రా, చీఫ్ ఇంజనీర్ కే రమేష్ బాబు, ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వర రావు, చీఫ్ ఇంజనీర్ కే నరసింహమూర్తి, ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, నిర్మాణ సంస్థ జి ఎంలు ఏ గంగాధర్, ప్రసేన్జిత్ మజుందార్, డీజీఎం మురళి పమ్మి తదితరులు ఉన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## గోల్డ్‌మైన్స్ గుర్తింపు: కొల్లు

గోల్డ్ మైన్స్ లిమిటెడ్ సంస్థ.. బంగారు శుద్ధి, ఉత్పత్తికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర సామాగ్రిని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఒకటన్ను ముడి సరుకు నుంచి ఒక గ్రాము బంగారం వస్తుందన్నారు. ప్రస్తుతం 300 మీటర్ల వరకు తవ్వారని... భవిష్యత్తులో రెండు కిలోమీటర్ల వరకు తవ్వకాలు జరుపనున్నట్లు చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు ఇది అని అన్నారు. అనంతపురం జిల్లా రామగిరి ప్రాంతంలో కూడా గోల్డ్ మైన్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. బీచ్ శాండ్ ద్వారా ఖనిజ సంపదను గుర్తించడం జరిగిందన్నారు. గ్రానైట్, క్వార్ట్జ్‌కు బాగా డిమాండ్ ఉందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో మైనింగ్ దోపిడీ జరిపి జేబులు నింపుకున్నారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ పరిశ్రమను వచ్చే నెల 27న సీఎం చంద్రబాబు ప్రారంభోత్సవం చేస్తారని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు..

భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి (హాశీఏఱుశ్రీ వీశీఎఱశ్రీఱ్‌ఎ) లభిస్తుందని పేర్కొన్నారు. ‘రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది’ అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన ‘క్రీమీ లేయర్’ నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీదారులకు ఉచిత భోజన పంపిణీ




**పాడేరు, పతాకం న్యూస్:** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పాడేరు, మరియు 'అన్న క్యాంటీన్' సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం విశేషంగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి వారం జిల్లా నలుమూలల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్)కు వచ్చే అర్జీదారుల సౌకర్యార్థం ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ సంయుక్తంగా ఉచిత భోజన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే గిరిజనులు, పేద ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడటం, ఆకలి తీర్చడం బాధ్యతగా భావించి, కొంతమంది బయట భోజనం చేయలేక ఆకలితో తిరిగి వెళ్లే వారికి ఇదొక మంచి అవకాశం అని, అలాగె పిజిఆర్ఎస్‌లో వారి సమస్యలను చెప్పుకున్నందుకు వచ్చిన అర్జీదారుల ప్రతి ఒక్కరికి ఈ భోజన సదుపాయం అందించడం జరిగిందన్నారు.

ఐటీడీఏ పాడేరు విభాగం మరియు అన్న క్యాంటీన్ నిర్వాహకుల సంయుకంగా నిర్వహించే ఈ ఉచిత భోజనం కార్యక్రమం పిజిఆర్ఎస్ అర్జీదారు అందించడంనిఎప్త్రప్త్ర జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ సెల్‌కు వచ్చే అర్జీదారులందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో పాల్గొని మాట్లాడుతూ, దూర ప్రాంతాల నుండి ఎన్నో ఆశలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీస వసతులు కల్పించడం తమ బాధ్యతని, అందులో భాగంగానే ఈ ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సదుపాయాన్ని అర్జీదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం ఉచిత భోజనం చేస్తున్న ముంచింపు మండలానికి చెందిన భోజనం ఎలా ఉందని ఆరా తీశారు, అలాగే కొయ్యూరు మండలం, యూ సిడి పాలెం గ్రామం నుండి వచ్చునా బలరాముని కలెక్టర్ భోజనం సదుపాయం ఏలాగ ఉంది అని అడిగి తెలుసుకున్నారు.

## కొలువుతీరిన సింహాచలం దేవస్థానం పాలక మండలి



**సింహాచలం, పతాకం న్యూస్:** సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం చేసింది. పాలక మండలి చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి ఆశోక్‌గజపతిరాజును కొనసాగిస్తూ 16 మంది సభ్యులు, మరొక ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులతో రాష్ట్ర ప్రభుత్వం పాలక మండలిని నాలుగు రోజుల క్రితం నియమించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సింహగిరిపై నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ భవనంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాటుచేశారు. సభ్యులకు దేవస్థానం సిబ్బంది ప్రమాణ పత్రాలను అందజేశారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ప్రమాణం చేయించారు. సభ్యులను దేవస్థానం ఎస్‌డిసి మధులత సభకు పరిచయం చేశారు. పాలక మండలి సభ్యులుగా ప్రమాణం చేసిన వారిలో మాకెన సీతారామ్‌పాత్రుడు (నవీన్), కసిరెడ్డి దామోదర్, చలమూరి భారతి, కరక దేవుడు, కనకాల మురళీమోహన్, వి.అన్నపూర్ణ, బీతల నీరజ లక్ష్మీకుమారి, మధుపడ సన్యాసిరావు, డాక్టర్ ధరణి బండ్ల, నీతిపల్లి మహేష్, పెద్దిశెట్టి ఉషశ్రీ, లలితజ్యోతి, గుత్తికొండ శ్రీలత, సుసరపు గణపతిరావు, చల్లంగి జ్ఞానేశ్వరి, పావులూరి శ్రీనివాసరావు ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యునిగా అప్పన్న ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పాలక మండలి సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా బోకం స్వామినాయుడు, వేదుల దక్షిణామూర్తి ఉన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కోళ్ల లలితకుమారి హాజరై...పాలక మండలి సభ్యులను అభినందించారు. ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో గోవా నుంచి వర్చువల్‌గా పాల్గొన్న చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ ఆలయ పవిత్రతను, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టను నూతనంగా నియమింపబడిన పాలకమండలి సభ్యులు కాపాడాలన్నారు. తమకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భక్తితో దైవానికి, భక్తులకు సేవలందించాలన్నారు.

## జూన్‌లో పలు రైళ్లు రీ షెడ్యూల్, మళ్లింపు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సౌత్ వెస్టన్ రైల్వే పరిధిలో నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూన్‌లో పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేశామని, మరికొన్ని రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

**రీ షెడ్యూల్:** బెంగళూరు-న్యూ టిన్సుకియా (22501) జూన్ 2న 30 నిమిషాలు, 9న 90 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరనుంది. టాటానగరం-బెంగళూరు (12889) జూన్ 19, 26 తేదీల్లో గంట ఆలస్యంగా, హటియా-బెంగళూరు (18637) జూన్ 20న గంట ఆలస్యంగా, మల్దా టౌన్-బెంగళూరు అమృతభారత్ (13434) జూన్ 21న 90 నిమిషాలు, జూలై 5న గంట ఆలస్యంగా, హటియా-బెంగళూరు (12835) జూన్ 21న 70, 23న 90 నిమిషాలు ఆలస్యంగా, బెంగళూరు-హటియా (18638) జూన్ 23న 3 గంటలు, 7న రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరనున్నాయి.

**మళ్లింపు:** మైసూరు-హౌరా (22818) ఎక్స్‌ప్రెస్ ఈనెల 31, జూన్ 7 తేదీల్లో వయా బెంగళూరు సిటీ జంక్షన్, యలహంక జంక్షన్, ధర్మవరం, గుంటూరు, విజయవాడ మీదుగా, బెంగళూరు-గువహటి (12509) జూన్ 4, 5, 10, 11, 12, జూలై 3 తేదీల్లో వయా యలహంక, ధర్మవరం, విజయవాడ మీదుగా, హౌరా-మైసూరు (22817) జూన్ 5, 12, 19, 26 తేదీల్లో విజయవాడ, నంద్యాల, యలహంక, బెంగళూరు సిటీ మీదుగా, హటియా-బెంగళూరు (18637), బలుర్‌ఘాట్-బెంగళూరు (16524) రైళ్లు జూన్ 6న బంగారపేట, కోలార్, చిక్‌బల్లాపూర్, యలహంక మీదుగా; హటియా-బెంగళూరు (12835) జూన్ 9న వయా ధర్మవరం, యలహంక, బెంగళూరు మీదుగా; బెంగళూరు-ముజాఫర్‌పూర్ (15227) జూన్ 11న ధర్మవరం, విజయవాడ మీదుగా; గువహటి-బెంగళూరు (12510) జూలై 7న విజయవాడ, ధర్మవరం, యలహంక, చిన్నసంద్ర మీదుగా నడుస్తాయి.

## అనకాపల్లి పోలీసు సిబ్బంది సంక్షేమమే మా ధ్యేయం



**అనకాపల్లి, పతాకం న్యూస్**: జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఆదేశాల మేరకు 'SP-SAMPARK' ఫోన్-ఇన్ కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు స్వయంగా ఫోన్ లైన్ ద్వారా క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారులకు మరియు క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, సిబ్బంది తమ వ్యక్తిగత లేదా వృత్తిపరమైన ఇబ్బందులను ఎటువంటి సంకోచం లేకుండా పంచుకునేందుకు ఈ వేదికను రూపొందించారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది 93469 12011 నంబర్ ద్వారా అదనపు ఎస్పీ గారితో నేరుగా మాట్లాడారు. సిబ్బంది ప్రధానంగా తమ సర్వీస్ పరమైన పోస్టింగ్స్, బదిలీలు, సెలవులు మరియు కుటుంబ ఆరోగ్య సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను లోతుగా విశ్లేషించిన అదనపు ఎస్పీ వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. 'కానిస్టేబుల్ నుండి హోమ్ గార్డు వరకు ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడమే మా ప్రాధాన్యత. దూర ప్రాంతాల నుండి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, సిబ్బంది తమ సమస్యలను నేరుగా నాతో పంచుకోవచ్చు. ప్రతి సమస్యను అత్యంత గోప్యంగా ఉంచుతూ త్వరితగతిన పరిష్కారం చూపుతాం." జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి శుక్రవారం ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిరంతరాయంగా కొనసాగుతుంది. వచ్చే ప్రతి ఫిర్యాదును డిజిటల్ రిజిస్టర్‌లో నమోదు చేసి, అది పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ గిరి మరియు ఇతర పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సమస్యలపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకూడదని, అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. అలాగే పాడైన బోర్లు, మోటార్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అధికారులు డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో పర్యటించి సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో కొయ్యూరు మండలంలో తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయని గుర్తించిన ఆమె, అక్కడ పరిస్థితులను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడం అధికారులు బాధ్యతని, అందుకు నిధుల కొరతలేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్వో ఎంవీఎస్ లోకేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వీబీ.నాగేశ్వరరావు, డ్వామా పీడీ విద్యాసాగరరావు, సీపీవో ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎండ ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన సబ్బవరం మెయిన్ రోడ్డు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో అటు ఏజెన్సీని ఆనుకొని వున్న మండలాల మొదలు ఇటు సముద్ర తీరంలోని మండలాల వరకు ఎండ మండిపోయింది. సాధారణంకంటే నాలుగు నుంచి ఐదు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీక్షణంగా కాయడంతో మధ్యాహ్నానికి పరిస్థితి ఎంత తీవ్రంగా వుంటుందో ప్రజలకు అర్థమైంది. దీంతో బయట పనులను త్వరగా ముగించుకొని ఇళ్లకే పరిమతం అయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వాతావరణం నిప్పులకొలిమిలా మారింది. రహదారులపై జనసంచారం బాగా తగ్గిపోయింది. ఫుట్ పాత్ చిరువ్యాపారులతోపాటు పెద్ద వ్యాపారులు సైతం 11 గంటలకే దుకాణాలను మూసివేశారు. జిల్లాలో 24 మండలాలకుగాను 18 మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైబడి నమోదయ్యాయి. అన్ని మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. దేవరాపల్లి మండలంలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మిగిలిన మండలాలను పరిశీలిస్తే.. మాకవరపాలెంలో 44.3 డిగ్రీలు, చీడికాడలో 44.3, నాతవరంలో 44, బుచ్చెయ్యపేటలో 42.4, చోడవరంలో 43, కశింకోటలో 43.2, మాడుగులలో 43.3, నర్సీపట్నంలో 43.2, కె.కోటపాడులో 42.9, రావికమతంలో 42.5, గొలుగొండలో 42.6, కోటవురట్లలో 41.1, మునగపాకలో 40.6, పరవాడలో 41.7, రోలుగుంటలో 42.3, సబ్బవరంలో 41.7, అనకాపల్లిలో 40.1, అచ్యుతాపురంలో 37.2, నక్కపల్లిలో 38.7, పాయకరావుపేటలో 38.9, రాంబిల్లిలో 37.2, ఎస్.రాయవరంలో 39, ఎలమంచిలిలో 38.2 డిగ్రీలు నమోదయ్యాయి. మరో మూడు రోజులపాటు ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే విధంగా నమోదయ్యే అవకాశం వుండడం, తీవ్రవడగాడ్పులు వీయనుండడంతో ప్రజలు అప్రమత్తంగా వుండాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు అత్యవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని పేర్కొన్నది. కాగా దాహం వేయకపోయినా.. తరచూ నీరు తాగాలని, వాంతులు/ విరేచనాలు అవుతుంటే ఓఆర్ఎస్ లేదా నిమ్మ రసం కలిపిన నీటిని తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

## మండల పాయింట్లకు విద్యార్థుల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వచ్చే విద్యా సంవత్సరానికిగాను జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మునిసిపల్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలను మండల పాయింట్లకు పంపించారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు అందజేస్తారు. దీని ప్రకారం జిల్లాలో 69,279 మంది విద్యార్థులకు యూనిఫాం, బూట్లు, బ్యాగులు సరఫరా కానున్నాయి. అలాగే ఒకటి నుంచి ఐదు తరగతి వరకూ బాలికలు, ఒకటి నుంచి పదో తరగతి వరకు బాలురు...మొత్తం 45,360 మందికి బెల్టులు, ఆరో తరగతి చదివే 7,879 మంది విద్యార్థులకు ఆక్స్‌ఫర్డు నిఘంటువు, అన్ని సబ్జెక్టులకు కలిపి 4,57,996 పాఠ్య పుస్తకాలు కేటాయించారు. గాజువాకలో గల జిల్లా స్థాయి డిపో నుంచి 11 మండల పాయింట్లకు పాఠ్య పుస్తకాలు పంపించారు. నెలాఖరుకు మొత్తం కిట్లు జిల్లాకు చేరతాయని విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రతి పాఠశాల పాయింట్‌కు కిట్లు పంపిణీ చేపడతామన్నారు. జూన్ 12 (పాఠశాలల పునఃప్రారంభం రోజు)న విద్యార్థులకు కిట్లు అందజేస్తామన్నారు. యూనిఫాం ప్రతి విద్యార్థికి మూడు జతలు అందజేస్తామని, కుట్టు మజూరీ కోసం జతకు రూ.60 తల్లుల ఖాతాకు జమ చేస్తామని వివరించారు. కాగా చినగదిలి మండలానికి సంబంధించి కిట్లు తోటగరువు జడ్పీ ఉన్నతపాఠశాలలో భద్రపరుస్తున్నారు. వచ్చిన యూనిఫాం, పుస్తకాలను విద్యార్థుల సంఖ్య మేరకు ప్యాకింగ్ చేసి సిద్ధం చేస్తున్నామని ఎంఈవో రవీంద్రబాబు తెలిపారు.

## ఏపీలో భారత్ నెట్ అమలు: మాధవ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీ విస్తరణకు భారత్‌నెట్ అమలు కార్యక్రమాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య, రైతులకు ఆధునిక వ్యవసాయ సమాచారం, మహిళలకు డిజిటల్ సేవలు, యువతకు ఉపాధి అవకాశాలు మరింత చేరువ అవుతాయని ఆయన పేర్కొన్నారు. భారత్‌నెట్ ప్రాజెక్ట్ గ్రామీణ భారత అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు డిజిటల్ కనెక్టివిటీతో మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా డిజిటల్ ఇండియా కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని, గ్రామీణ ప్రజలను సాంకేతిక రంగంలో భాగస్వాములను చేయడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పీవీయన్ మాధవ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. డిజిటల్ సేవల విస్తరణతో పారదర్శక పాలన, వేగవంతమైన సేవల వలన గ్రామీణ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారత్‌నెట్ అమలు ద్వారా గ్రామాలు స్మార్ట్ గ్రామాలుగా మారే దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతుందన్న ఆశాభావాన్ని మాధవ్ వ్యక్తం చేశారు.

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని శ్రీకాకుళం ఇన్‌చార్జి ఆర్డీవో టి.వేణుగోపాల్ కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియకు అందరూ తమ విలువైన సూచనలు, సలహాలు అందించి సహకరించాలన్నారు. నియోజకవర్గంలో 2,75,845 మంది ఓటర్లు ఉండగా 1,74,736 మందికి మ్యాపింగ్ చేశామని తెలిపారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌కు బూత్‌లెవెల్ ఏజెంట్లను రాజకీయ పార్టీలు నియమించి, జాబితాలను ఈనెల 30లోగా ఇవ్వాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు గణపతిరావు, చక్రవర్తి, జానకి, డీటీ జీకే శ్రీనివాసరావు, బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ, టీడీపీ, జనసేన ప్రతినిధులు భూషణరావు, ఈశ్వరి, మురళీధర్, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, భాస్కరరావు పాల్గొన్నారు.

## 28 తులాల బంగారం స్వాధీనం



**పూసపాటిరేగ, పతాకం న్యూస్:** మండలంలోని చల్లవానితోట పంచాయతీ పరిధిలోగల గొల్లపేటలో ఈనెల 17వ తేదీన 28 తులాల బంగారం చోరీకి గురైన విషయం విధితమే. ఈ కేసును స్థానిక పోలీసులు మూడు రోజుల్లో ఛేదించారు. ఈ ఘటనపై భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 17న గొల్లపేటలో రీసు రాజు అనే మహిళ ఇంట్లో చోరీ జరిగింది. చోరీ జరిగిన వెంటనే భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్‌లతో పాటు పోలీసు యంత్రాంగం దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన రోజున గ్రామం నుంచి బయటకు వెళ్లిన వారి డేటాతోపాటు, ఆ రోజు గ్రామంలో అనుమానాస్పందంగా ఉన్నవారి సెల్‌ఫోన్లను ట్రేక్ చేశారు. తర్వాత రోజున సుమారు 20మంది చేతివేళ్ల నమూనాలు సేకరించారు. చోరీ జరిగిన రోజున సేకరించిన చేతివేళ్ల నమూనాలు వీటికి సరిపడ్డాయి. అలాగే సెల్‌ఫోన్ ట్రేక్ చేసిన డేటాలతో పాటు మరికొన్ని సరిపడటంతో అనుమానితుడైన అదే గ్రామానికి చెందిన మాతికమాని అప్పలనాయుడుపై పోలీసులు నిఘా ఉంచారు. చోరీ చేసిన బంగారాన్ని అమ్మడానికి విజయనగరం వెళ్లేందుకు యాతపేట జంక్షన్ వద్ద ఉన్న అప్పలనాయుడును పోలీ సులు మాటువేసి, పట్టుకున్నారు. ఈ చోరీకి సహాయం చేసిన పీత సాయిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 28 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసును ఎంతో చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

## విద్యుత్ శాఖ 625 ఏఈ పోస్టులు భర్తీ: గొట్టిపాటి



**మార్కాపురం, పతాకం న్యూస్:** విద్యుత్ శాఖలోని 625 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 200 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తిచేసినట్టు ఆయన తెలిపారు. మార్కా పురం జిల్లా పుల్లల చెరువు మండలంలోని ఐటీవరంలో రూ.3.80 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. దోర్నాలలో నూతన బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన, చిన్నగుడిపాడులో సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'విద్యుత్ శాఖను బలోపేతం చేసేందుకు త్వరలోనే ఏఈ, లైన్‌మెన్ పోస్టులను భర్తీ చేస్తాం. కడపలో 600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను త్వరలో మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు. వైసీపీ హయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచితే కూటమి ప్రభుత్వం 13 పైసలు ట్రూ డౌన్ చేసింది.' కార్యక్రమంలో కలెక్టర్ ఎం.విజయ సునీత, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**కాకినాడ, పతాకం న్యూస్:** నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ .... దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెసెంటేటివ్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం, లేబర్ కోడ్స్ జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం చాలా దారుణమని వెంటనే నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు వల్ల పిక్స్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ విధానాన్ని తీసుకువచ్చారని దీనివల్ల కార్మికులను, ఉద్యోగులను కొంత పరిమితి కాలానికి పనిలో పెట్టుకుని తర్వాత మీకు పనిలేదని పంపించే విధంగా ఉద్యోగ భద్రత లేకుండా చేయడం కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. సిఐటియు నగర కో- కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ అమలులో భాగంగా ఎనిమిది గంటల పని దినాన్ని రద్దుచేసి 12, 13 గంటలు పనిచేయించుకోవచ్చని క్యాబినెట్ తీర్మానం చేయడం చాలా దుర్మార్గమైన చర్యని అన్నారు.

# సచివాలయం వద్ద ఉద్రిక్తత.. కవిత అరెస్ట్




**హైదరాబాద్, పతాకం న్యూస్:** రాష్ట్రంలో వరి ధాన్యం, జొన్నల కొనుగోలులో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నేతృత్వంలో శుక్రవారం సెక్రటేరియట్ వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. సచివాలయం ఎదుట ప్రధాన రహదారిపై వరి ధాన్యాన్ని పోసి కవిత తన పార్టీ శ్రేణులతో కలిసి ధర్నాకు దిగారు. దీంతో సెక్రటేరియట్ పరిసర ప్రాంతాల్లో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత, భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ .... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తీవ్ర చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా కల్లాల్లోనే ధాన్యం ఎండిపోతోందన్నారు. అన్నదాతలను ప్రభుత్వం అరిగోసలు పెడుతోందని ఆరోపించారు. తెలంగాణ రైతుల బాధలు, వారి గోస ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఈ ప్రభుత్వానికి తెలియాలనే నేరుగా సచివాలయం వద్దకు వచ్చి నిరసన తెలుపుతున్నామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలవుతున్నా.. వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కసారి కూడా కనీసం సమీక్ష నిర్వహించకపోవడం రైతుల పట్ల వారికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యంతోపాటు, జొన్నలను కూడా తక్షణమే మద్దతు ధరతో పాటు బోనస్ అందించి కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ వద్ద ధర్నా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి భారీగా చేరుకున్నారు. కవితతో పాటు నిరసనలో పాల్గొన్న పార్టీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి అరెస్ట్ చేశారు. అనంతరం వారిని ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రైతుల సమస్యలపై తమ పోరాటం ఆగదని, కొనుగోళ్లు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో రైతుల పక్షాన నిలబడతామని ఈ సందర్భంగా టి.ఆర్.ఎస్ శ్రేణులు నినాదాలు చేశారు.

## మరుగుదొడ్లు లేవు.. నీటి సౌకర్యం లేదు



**గార, పతాకం న్యూస్:** గార ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు తిష్ఠవేశాయి. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గార నుంచి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లోగల ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులకు వెళ్లి వచ్చే వారు ఇక్కడకు వస్తుంటారు. అయితే బస్టాండ్‌లో కనీసం కూర్చో వడానికి కుర్చీలు లేకపోవడంతో సిమెంట్ దిమ్మలపైనే ప్రయాణికులు వేచి ఉండాల్సివస్తోంది. విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో చీకటి పడితే బస్టాండ్ ఆవరణలో అంధకారం అలముకుంటోంది. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేకపోవడంతో ఇక్కడకు వచ్చే ప్రయా ణికులు అగచాట్లకు గురవుతున్నారు. ఇక్కడ శ్రీకాకుళం పాతబస్టాండ్ నుంచి బందరువానిపేటకు వెళ్లే ప్రయాణికులతో పాటు బూరవెల్లి రోడ్డులో కొమరవానిపేట వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు కూడా బస్సుల కోసం ఇక్కడ వేచిఉంటున్నారు. బస్టాండ్‌లో కూర్చొవడానికి సిమెంట్ బల్లలు సైతం లేకపోవడంతో చెట్ల కింద నిరీక్షించాల్సి వస్తోంది. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన బస్టాండ్ కావడంతో స్తం భాలు కూడా బీటలు వారాయి. గార ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయా ణికులు కూర్చొవడానికి సిమెం ట్ బల్లలు ఏర్పాటుచేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం, మం చినీరు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించి అందుబాటులోకి తీసు కు రావాలని పలువురు ప్రయా ణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

## పార్వతీపురంలో అధిక ఉష్ణోగ్రతలు



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. చాలా మండలాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలకు జన సంచారం లేక రోడ్లు, ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 11 గంటల నుంచి 4 వరకూ వ్యాపార సముదాయాలన్నీ మూతపడ్డాయి. కూలీలు, రోడ్డు పక్కన వ్యాపారులు చేసే వారు ఇబ్బందులు పడడం కనిపించింది. సాలూరు పట్టణంలో మధ్యాహ్నం 12 గంటలకు 44.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పాచిపెంటలో 44, వీరఘట్టంలో 43.9, మక్కువలో 43.7, జియ్యమ్మవలసలో 43.4, పాలకొండలో 43.1, బలిజిపేటలో 42.7, భామినిలో 42.6, కురుపాంలో 42, గుమ్మలక్ష్మీపురంలో 41.4, సీతంపేటలో 40.6, గరుగుబిల్లిలో 40.5, కొమరాడలో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లాల్సి వస్తే మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ వంటి ద్రవాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా తలకు టోపీ, గొడుగు వినియోగించాలని అంటున్నారు.

## ఆంద్ర జలాశయం నుంచి నీరు విడుదల

**విజయనగరం, పతాకం న్యూస్:** నగర వాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆంద్ర జలాశయం నుంచి అదనపు నీరు విడుదలవుతుందని కమిషనర్ బాలస్వామి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు ఆంద్ర జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే ప్రక్రియను నేడు ప్రారంభించారు. అక్కడి నుంచి నేరుగా చంపావతి నదిలోకి నీరు వచ్చి చేరుతుందన్నారు. నేటి నుండి జూన్ 6 వరకు నీటి విడుదల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జూన్ మాసాంతం వరకు విడుదలైన నీరు ప్రజల దాహార్తిని తీర్చనున్నదని చెప్పారు. ఆంద్ర జలాశయం వద్ద ప్రారంభమైన నీటి ప్రవాహం పిట్టాడా, మెంటాడ, కుదిపి, మీదుగా రామతీర్థాలు, నెల్లిమర్ల పంప్ హౌస్ ల వద్దకు చేరుతుంది. గత రెండు విడతలగా ఆంద్ర నుంచి 50 క్యూసెక్కులు చొప్పున 100 క్యూసెక్కులు నీటి విడుదల జరిగిందని, ప్రస్తుతం మూడో విడత మరోసారి నీరు విడుదలవుతుందని వెల్లడించారు. ప్రజలు తాగు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని చెప్పారు.

## కోట్లాది రూపాయలతో విద్యుత్ పనులు



**గార, పతాకం న్యూస్:** గత రెండేళ్లుగా కోట్లాది రూపాయలతో విద్యుత్‌శాఖలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తెలిపారు. దాసన్నపేట, ప్రశాంతినగర్‌లో రూ.5కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11కేవీ సబ్ స్టేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల వేణుగోపాల పురం వద్ద రూ.200కోట్లతో శంకుస్థాపన చేసిన సబ్ స్టేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, గత ఏడాది సోనియానగర్‌లో సబ్‌స్టేషన్ ప్రారంభించామని చెప్పారు. 100 నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, అలాగే నగ రంలోని వివిధ ప్రాంతాల్లో రూ.2కోట్ల 40లక్షలతో ఎనిమిది 11 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే వీటి అగ్రహారం నుంచి దాసన్నపేట వరకూ రూ.2కోట్ల 20లక్షలతో 33 కేవీ హెచ్‌టీ విద్యుత్ లైన్ వంటి అనేక పనులు చేయడం ద్వారా ప్రజలకు కోత ల్లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈ త్రినాథరావు, కూటమి నాయ కులు రాజేష్‌వర్మ, ప్రసాదుల ప్రసాద్, గంటా రవి, అనురాధ బేగం పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లా కేంద్రంలోని పౌరసరఫరాల సంస్థ గోదాంలో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈవీఎం గోదాములను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడ విధుల్లో ఉన్న కార్మికులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి వారి సాదబాధకాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తమకు ప్రతి నెలా పదో తేదీలోగా జీతాలు అందేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, దీంతో కుటుంబ నిర్వహణ ఇబ్బందిగా మారుతుందని కార్మికులు కలెక్టర్‌కు వివరించారు. తమకు ఎలాంటి బీమా సౌకర్యాలు కూడా లేవని చెప్పారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ అక్కడికక్కడే అధికారులు రప్పించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి జీతాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై వివరణ కోరారు. సాంకేతిక కారణాలతో ఈ నెల ఆలస్యమైందని డీఎం వివరించగా.. వాటిని అధిగమించి ఇకపై ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్మికులకు ప్రభుత్వం అందించే బీమా, ఇతర సంక్షేమ పథకాలపై కార్మికులకు అవగాహన అవసరమని తెలిపారు. వారికి లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న తాగునీటి పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు రానున్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి, వారిని ఒప్పించి ఆగిపోయిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. చెరువు గర్భాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని అన్నారు.

## ఎవరెస్టుపై ఇద్దరు భారతీయుల మృతి

**నేపాల్:** ఎవరెస్ట్ శిఖరంపై విషాదం చోటు చేసుకుంది. శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించిన తర్వాత, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వైపు తిరిగి వస్తుండగా ఇద్దరు భారతీయ పర్వతారోహకులు మరణించారు. పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ఫీల్డ్ ఆఫీస్ కోఆర్డినేటర్ ఖిమ్‌లాల్ గౌతమ్ మాట్లాడుతూ, ఎవరెస్ట్ అధిరోహణకు అనుమతులు ఉన్న 'పయనీర్ అడ్వెంచర్స్'కు చెందిన ఇద్దరు పర్వతారోహకులు బేస్‌కు తిరిగి వస్తుండగా కుప్పకూలిపోయారని చెప్పారు. మృతులను అరుణ్ కుమార్ తివారీ, సందీప్ ఆరేగా గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. వారు కిందకు దిగుతున్న సమయంలో తీవ్రంగా అలసిపోయారని, రక్షించేందుకు గైడ్స్ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని తెలిపారు.

# 30 రోజులు జైలులో ఉంటే పదవి ఊడినట్లేనా?..

## ప్రజాప్రతినిధుల అనర్హత బిల్లుపై కీలక భేటీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో అరెస్టయిన ప్రజాప్రతినిధుల పదవిని రద్దు చేసే కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లుపై కేంద్రం కసరత్తు ముమ్మరం చేసింది. '130వ రాజ్యాంగ సవరణ బిల్లు-2025'పై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. ఈ భేటీలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, పంజాబ్ రాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధులతో పాటు పలు విశ్వవిద్యాలయాల నిపుణులు పాల్గొన్నారు. ఈ బిల్లు ప్రకారం.. ఐదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష పడే అవకాశం ఉన్న క్రిమినల్ కేసులో అరెస్ట్ అయిన ప్రజాప్రతినిధి 30 రోజుల పాటు జైలులోనే ఉంటే.. 31వ రోజున తన పదవిని కోల్పోతారు. ఈ నిబంధన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులతో సహా అందరికీ వర్తిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హాజరై బిల్లులోని అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పలు సూచనలు చేశారు. గతేడాది ఎన్డీయే ప్రభుత్వం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రాజకీయ కక్ష సాధింపులకు ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని విమర్శలు రావడంతో దీనిని జేపీసీ పరిశీలనకు పంపారు. ప్రస్తుతం కమిటీ వివిధ రాష్ట్రాలు, నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. ఏయే సెక్షన్ల కింద నమోదైన కేసులకు ఈ నిబంధన వర్తింపజేయాలి, 30 రోజుల గడువులో ఎలాంటి మినహాయింపులు ఇవ్వాలనే అంశాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తోంది.

# బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు సంబంధించిన పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయి ప్రస్తుతం జైల్లో ఉన్న భగీరథ్, రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. భగీరథ్ తరఫు న్యాయవాది కరుణా సాగర్, తమ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. మే 16న భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన విజ్ఞప్తిని అంగీకరించిన న్యాయస్థానం, పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించింది. అదే సమయంలో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించింది. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలతో మే 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు పోక్సో చట్టంలోని కఠినమైన సెక్షన్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ కేసులో అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించడానికి మే 15న హైకోర్టు నిరాకరించడంతో, మే 16న రాత్రి పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు స్వయంగా లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. భగీరథ్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రస్తుతం భగీరథ్ చెర్లపల్లి జైల్లో ఉన్నాడు.

# 'చీడిగ' ప్రమాద బాధితులను ఆదుకోవాలి




**కాకినాడ, పతాకం న్యూస్:** ముఖ హాజరు కోసం రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఉపాధి కార్మికులను ఈ నెల 16న కాకినాడ రూరల్ మండలం కోవూరు బ్రిడ్జి సమీపంలో టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మరణించిన చీడిగ గ్రామానికి చెందిన ఐదుగురు కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా, చికిత్స పొందుతున్న వారికి రూ. పది లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ... ఘటన జరిగి ఐదు రోజులు కావొస్తున్న నేటికీ మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక సాయం అందించలేదన్నారు. కేవలం వారికి ఇచ్చే ఇన్సరెన్స్ డబ్బులకు సంబంధించిన హామీ మాత్రమే ఇచ్చారని తెలిపారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఉద్యోగ అర్హత లేని కుటుంబాలకు ఎకరం సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని, పేస్ యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఇటీవల అనేక ప్రమాదాల్లో చనిపోయిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించిందని, ఈ తరహాలోనే ఉపాధి కార్మిక కుటుంబాలకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ... మృతులకు రూ.నాలుగు లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ఇప్పటికే డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్. శ్రీనివాస్, సిఐటియు నాయకులు సిహెచ్.అజయ్ కుమార్, టి.రాజా, ప్రజా సంఘాల నాయకులు జిత్తుగ శ్రీనివాస్, కె.వీరబాబు, వాసంశెట్టి చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

# వంశధార వంతెనకు మోక్షం!



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లా ప్రజలు, పర్యాటకులు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న వంశధార హైలెవల్ వంతెన నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చిన నాలుగు రోజుల్లోనే.. వంతెన పనులకు సంబంధించి సవరించిన అంచనాలను ఆమోదిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నెల 16న నరసన్నపేట పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఈ వంతెన సమస్యను తీసుకువెళ్లారు. 'పోలాకి మండలం వనితమండలం గ్రామం నుంచి ప్రముఖ పర్యాటక ప్రాంతమైన శాలిహుండాన్ని కలుపుతూ వంశధార నదిపై నిర్మించతలపెట్టిన వంతెన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని తక్షణమే నిధుల మంజూరు చేయాల'ని ఎమ్మెల్యే కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి వంతెన పనుల సవరించిన అంచనాలకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ కావడం విశేషం. వంశధార హైలెవల్ వంతెన నిర్మాణానికి సంబంధించి 2016 జూన్ 4న అప్పటి ప్రభుత్వం జీవో నెం.329 ద్వారా రూ.72కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. సుదీర్ఘ కాలం గడిచిపోవడంతో నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం, పాత అంచనాలతో పనులు చేయడం సాధ్యం కాకపోవడంతో కాంట్రాక్టరు పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు.

ఈ నేపథ్యంలో విజయవాడలోని ఈఎన్సీ(ఆర్అండ్‌బీ) ఈ ఏడాది ఏప్రిల్ 6న ప్రభుత్వానికి సవరించిన వర్కింగ్ ఎస్టిమేట్స్(పని అంచనాలు) పంపారు. జీఎస్టీ, ధరల సవరణ, టీపీ, సీనరేజ్ చార్జీల పెరుగుదల కారణంగా వంతెన నిర్మాణ వ్యయం రూ.72 కోట్ల నుంచి రూ.84 కోట్లకు పెరిగినట్లు ఆ నివేదికలో స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వినతి, ఈఎన్సీ ప్రతిపాదనలను నిశితంగా పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం.. పెరిగిన రూ.12 కోట్ల అదనపు వ్యయానికి ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు రూ. 84 కోట్లతో సవరించిన వర్కింగ్ ఎస్టిమేట్‌కు అనుమతిస్తూ రవాణా, రోడ్లు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు జీవో ఆర్టీ నెం. 286 జారీచేశారు.

ఆర్థిక శాఖ ఏకాభిప్రాయంతో ఈ నిధులకు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సవరించిన అంచనాలకు ఆమోదం లభించడంతో తక్షణమే తదుపరి చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్అండ్‌బీ ఈఎన్సీని ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిన తక్షణ స్పందనపై నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక బౌద్ధారామ క్షేత్రమైన శాలిహుండానికి పర్యాటకుల తాకిడి పెరగడానికి, వనితమండలం పరిసర ప్రాంతాల ప్రజల రవాణా కష్టాలు తీరడానికి ఈ వంతెన ఎంతో కీలకం. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రత్యేక చొరవతో దశాబ్ద కాలపు నిరీక్షణకు కేవలం నాలుగు రోజుల్లోనే పరిష్కారం లభించిందని జిల్లావాసులు సంబరపడుతున్నారు.

# ఎండ వేడికి తట్టుకోలేక ప్రతిరోజు లక్షలాది కోళ్లు మృత్యువాత



**తణుకు, పతాకం న్యూస్:** పౌల్ట్రీ పరిశ్రమకు వేసవి దెబ్బ తగిలింది. ఎండ వేడికి తట్టుకోలేక ప్రతిరోజు లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు రోజులుగా సుమారు పది లక్షల కోళ్లు మృత్యువాత పడినట్లు పౌల్ట్రీ రైతులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా భారీ సంఖ్యలో కోళ్లు చనిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా లేయర్ ఫారాల్లో వేడి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. గాలి వెళ్లే మార్గాలు లేకపోవడం, తాగునీటి కొరత, విద్యుత్ అంతరాయం కూడా కోళ్ల మరణాలకు కారణంగా భావిస్తున్నారు. వేసవిలో కోళ్లు బరువు తగ్గడం, మేత తినకపోవడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం తదితర కారణాలతో పరిశ్రమ నష్టాల బారిన పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోళ్ల ఫారాల్లో సుమారు కోటీ 20 లక్షల కోళ్లు ఉన్నాయి. వాటిలో 90 లక్షల వరకు గుడ్డు ఉత్పత్తి అవుతుంది. ఎక్కువగా గుడ్లు ఉత్పత్తి చేసే కోళ్లు చనిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రత ప్రభావం బర్డ్‌ఫ్లూ కంటె ఎక్కువగా నష్టం కలిగిస్తోందని వాపోతున్నారు. చనిపోయిన కోళ్లను గొయ్యితీసి పాతిపెడుతున్నారు. కోళ్లకు బీమా చేయించుకునే పరిస్థితి ఉండేది. బీమా చేసే కంపెనీల ఆంక్షలు, భారీ ప్రీమియంతో రైతులు ఆసక్తి చూపడంలేదు. కోట్లు పెట్టుబడి పెట్టి బీమా చేయించినా అవసరమైనపుడు బీమా కంపెనీలు పలు కొర్రీలతో క్లెయిమ్ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. వేసవిలో పౌల్ట్రీ నిర్వహణకు సాధారణ రోజులకంటే అదనపు ఖర్చు అవుతోంది. షెడ్డులకు చల్లని వాతావరణం కల్పించడానికి స్పింక్లర్లు, షెడ్డులపై గడ్డి, చల్లని నీరు, షెడ్డుల చుట్టు గోనె సంచుల ఏర్పాటు, వాటిని తడపడం, విద్యుత్, జనరేటర్లు, రిపేర్లకు అధిక మొత్తం వెచ్చించాల్సి వస్తోంది.

# వృద్ధురాలిపై వడ్డీ వ్యాపారులు దౌర్జన్యం .. ఇల్లు లాక్కునేందుకు కుట్ర



**ఆదోని, పతాకం న్యూస్:** ఆదోని, మే 21 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిపై వడ్డీ వ్యాపారులు దౌర్జన్యం ప్రదర్శించి ఆమె ఇంటికి తాళం వేశారు. ఈ ఘటన ఆదోని త్రీ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని చోటుచేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన టి.మీనాక్షమ్మ అనే వృద్ధురాలు తన అవసరాల కోసం స్థానికంగా ఉండే గోల్డ్ రమేష్ వద్ద తన ఇంటిని తాకట్టు పెట్టి రూ.4.50లక్షలు అప్పుగా తీసుకుంది. ఈఏడాది జనవరి 1న తాను తీసుకున్న అసలు మొత్తాన్ని చెల్లించేందుకు మీనాక్షమ్మ అతడి వద్దకు వెళ్లింది. రమేష్ అసలుతో పాటు భారీగా వడ్డీ కూడా కావాలని డిమాండ్ చేశాడు. తాను అంత వడ్డీ కట్టలేనని బాధితురాలు ప్రాధేయపడింది. ఆగ్రహానికి గురైన గోల్డ్ రమేష్, అతడి అనుచరుడు ఉదయ్‌కుమార్ కలిసి అప్పట్లో మీనాక్షమ్మ ఇంట్లోకి అక్రమంగా చొరబడ్డారు. వృద్ధురాలని కూడా చూడకుండా ఆమెను బలవంతంగా బయటకు లాగేశారు. ఇంట్లో ఉన్న సామగ్రిని రోడ్డుపై పడేశారు. బాధితురాలిని, ఆమె కుమార్తెలను నానా దుర్భాషలాడుతూ తీవ్రంగా అవమానించి ఇంటికి తాళం వేశారు. అప్పట్లో బాధితురాలు ఈ విషయమై స్థానిక పెద్దలను ఆశ్రయించగా పంచాయితీ చేశారు. అదేరోజే రూ.50వేలు చెల్లించాలని, మిగిలిన రూ.4లక్షలు మొత్తాన్ని ఎలాంటి వడ్డీ లేకుండా మూడు నెలలోపు కట్టాలని పంచాయితీ నిర్వహించారు. పెద్దల మాట ప్రకారం మీనాక్షమ్మ గడువులోగా మిగిలిన రూ.4లక్షల నగదును పట్టుకుని గోల్డ్ రమేష్ వద్దకు వెళ్లింది. ఎలాగైనా ఆమె ఇంటిని ఆక్రమించుకోవాలని అతడు ఆ డబ్బులు తీసుకోవడానికి నిరాకరించాడు. ఆమెను ఇంటి నుంచి గెంటేసి మరోసారి తాళం వేసి ఇంటిని లాక్కునేందుకు కుట్ర వేశాడు. విసిగి పోయిన బాధితురాలు పోలీసుల ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వాటర్ ట్యాంకర్లకు పెరిగిన డిమాండ్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** నగరంలో తాగునీటి కష్టాలు అధికమయ్యాయి. భానుడి భగభగలకు భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో కొండాపూర్‌లో నీటి సరఫరాకు డిమాండ్ పెరిగింది. తాగునీటి కష్టాలను అధిగమించేందుకు ప్రజలు ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారు. కొండాపూర్ డివిజన్‌లోని తులీప్ కమ్యూనిటీ, మసీద్‌బండ వద్ద ఉన్న రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నుంచి జలమండలి అధికారులు అర్ధరాత్రి 12 గంటల వరకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. కొండాపూర్ డివిజన్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ బాగా పెరిగింది. ఓవర్‌హెడ్ ట్యాంకులకు ఇన్‌పుట్ తగ్గడం, అవుట్‌పుట్ పెరగడంతో నీటి సరఫరాలో అంతరాయం పెరుగుతుంది. రెండు నెలల క్రితం ఒక్కో పాయింట్ వద్ద ప్రతీ రోజు 40నుంచి 60 ట్యాంకర్లు బుకింగ్ అయ్యేవి. ప్రస్తుతం ఎండలు ముదిరిపోవడంతో డిమాండ్ పెరిగి ఒక్కో పాయింట్ వద్ద 200 నుంచి 350 ట్యాంకర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. అంటే గడిచిన రెండు నెలల్లో ట్యాంకర్లకు ఆరింతల డిమాండ్ పెరిగిందన్నమాట. మరో నెల రోజులు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని జలమండలి అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ట్యాంకర్లకు డిమాండ్ పెరగడంతో ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా చేసే నీటిని 40నిమిషాలకు కుదించారు. కాలనీ వాసులకు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మొత్తం మీద వేసవికాలం ముగిసే వరకు ఈ నీటి తిప్పలు తప్పేలా లేవు.

## అకాల వర్షానికి నేలకొరిగిన అరటి, బొప్పాయి




**అనంతపురం, పతాకం న్యూస్:** ఆత్మకూరు మండలంలో రాత్రి వీచిన ఈదురుగాలులు, అకాల వర్షానికి మండలంలోని అరటి, బొప్పాయితో పాటు విద్యుత్ స్తంభాలు పడి కరెంటు లేక బ్యాంక్ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈదురుగా లులకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆత్మకూరుకి చెందిన రైతు ఆవుల మాధవరెడ్డి తన పొలంలో వేసిన నాలుగు వేలు బొప్పాయి చెట్లు పంట చేతికి వచ్చే టైంలో రాత్రి వీచిన ఈదురుగాలులకు నేలమట్టమయ్యాయి. సుమారు10 లక్ష రూపాయల వరకు నష్టపోయారని రైతు వాపోయారు. మండల కేంద్రంలో విద్యుత్తు వైర్లపైన చెట్లు విరిగి పడడంతో 5 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురుగాలులకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతులు వేడుకొంటున్నారు.

## వ్యవస్థాగత నిర్లక్ష్యాల వల్లే ప్రమాదాలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** చిన్న చిన్న వ్యవస్థాగత నిర్లక్ష్యాల వల్లే రహదారులపై పెద్ద పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు తెలిపారు. శ్రీకాకుళంలోని న్యాయ సేవాసదన్‌లో సుప్రీంకోర్టు ఆదేశాల మేర కు సంబందిత అధికారులతో(స్టేక్ హోల్డ ర్లు) సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో రహదారు ల ప్రమాదాల్లో 34 మంది ప్రాణాలు కోల్పోయిన నేపద్యంలో సుప్రీంకోర్టు రహదారుల ప్రమాదాలకు వ్యవస్థాగత నిర్లక్ష్యాలే కారణమని నిర్ధారించి కొన్ని మార్గదర్శకాలు సూచిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవె న్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ ఎన్.భాస్క రరెడ్డి, ఆర్టీవో ఎ.విజయ సారధి జాతీయ రహదారుల అధారిటీ అధికారి ప్రభాత్, కేవీ సురేష్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, పోలీసు అధికారి వి.రమేష్ పాల్గొన్నారు

## తిరుమలలో భారీగా పెరిగిన రద్దీ



**తిరుపతి, పతాకం న్యూస్:** విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే యాత్రికుల సంఖ్య రోజురోజుకు పెరుగు తోంది. యాత్రికులు భారీగా తరలి రావడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2లోని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం నారాయణగిరి ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన షెడ్లలో కూడా నిండి బాట గంగమ్మ ఆలయం క్యూలైన్ కొనసాగుతోంది. అయితే రద్దీ పెరగడంతో తిరుమలకు వచ్చే యాత్రికులకు టిటిడి పలు కీలక సూచనలు చేసింది. యాత్రికులు క్యూలైన్లలోకి రావద్దని,ఉదయం ఆరు గంటలకు రావాలని చెప్పింది. తిరుమలలో యాత్రికుల రద్దీ నెలకొనడంతో వారి సౌకర్యార్థం టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వారికి ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బాటగంగమ్మ సర్కిల్ నుండి గోగర్భం డ్యామ్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ వరకు చలువ పందిళ్ళు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2, మ్యూజియం ప్రాంగణం, నారాయణగిరి ఉద్యానవనాల్లో నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేసింది. ఉదయం అల్పాహారంగా పాలు ఉప్మా, పొంగల్, మధ్యాహ్నం సాంబారన్నం, పులిహోర, టమోట రైస్, రాత్రి పాలు ఉప్మా, సాంబారన్నం యాత్రికులకు నిరంతరాయంగా పంపిణీ జరుగుతోంది.

## జమ్మలమడుగులో రూ.3 వేల కోట్ల ఎస్‌ఏఈఎల్ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించిన లోకేష్




**కడప, పతాకం న్యూస్:** ఒక ప్రాజెక్టు ప్రారంభమవ్వడమంటే కేవలం రిబ్బన్ కటింగ్ కాదని, అది దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణల కలయిక అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో రూ.3,000 కోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ, "మా నాన్న ఉత్తరం రాశారు, మా తాత కల కన్నారు, నేను ఆత్మలతో మాట్లాడాను అంటే ఇప్పుడు నమ్మేవాళ్ళు ఎవరూ లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్ అయితే... మీ బ్రాండ్ గొడ్డలి" అంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రికార్డు సమయంలో ఎస్‌ఏఈఎల్ ప్రాజెక్టు పూర్తి కావడం స్థానిక రైతుల, జమ్మలమడుగు యువత విజయమని లోకేష్ ప్రశంసించారు. "మీ సహకారం వల్లనే ఈ భారీ ప్రాజెక్టు కేవలం 11 నెలల్లో పూర్తయింది. ఈరోజు రాష్ట్రం మొత్తం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఇక్కడ మెగా సోలార్ పార్క్, అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో--ఎన్టీపీసీ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులతో పాటు ఇప్పుడు ఎస్‌ఏఈఎల్ ను కూడా తీసుకువచ్చింది మనమే. కంపెనీలు తేవాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది బ్రాండ్ సీబీఎన్‌కే సాధ్యం" అని లోకేష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన విజయవంతం కావడానికి మూడు ముఖ్య కారణాలు ఉన్నాయని లోకేష్ వివరించారు. "మొదటిది-బ్రాండ్ సీబీఎన్. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే నాయకత్వం ఉండటంతో పెట్టుబడిదారులు ఏపీ వైపు చూస్తున్నారు. రెండవది -- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. వేగంగా నిర్ణయాలు తీసుకుని, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం మా విధానం. ఈ ప్రాజెక్టే దానికి నిదర్శనం. మూడవది -- డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోంది" అని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తున్నామని లోకేష్ తెలిపారు. "ఆధునిక ఆర్థిక వ్యవస్థకు ఆవిష్కరణలే కీలకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్‌లను నిర్మిస్తున్నాయి" అని ఆయన వివరించారు.

# కీళ్ల నొప్పులకు అసలు కారణాలేంటి..?



కీళ్ల నొప్పులకు అసలు కారణాలేంటి.. ఎన్ని రకాలుగా ఉంటాయి..? నేటి తరుణంలో కీళ్ల నొప్పులు సాధారణ ఆరోగ్య సమస్యగా మారాయని చెప్పవచ్చు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ లేదా శరీర నిర్మాణ సం బంధిత సమస్యల కారణంగా చాలా మంది ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ఇందులో ముఖ్యంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియోఆర్థరైటిస్ అనే రెండు వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నేటి తరుణంలో కీళ్ల నొప్పులు సాధారణ ఆరోగ్య సమస్యగా మారాయని చెప్పవచ్చు. ముఖ్యంగా వయస్సు పెరుగుతున్న కొద్దీ లేదా శరీర నిర్మాణ సంబంధిత సమస్యల కారణంగా చాలా మంది ఈ ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. ఇం దులో ముఖ్యంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఆస్టియోఆర్థరైటిస్ అనే రెండు వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే చాలా మంది ఈ రెండూ ఒకటేనని భావిస్తారు. కానీ వీటి కారణాలు, లక్షణాలు, చికిత్స విధానాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది ఒక ఆటోఇమ్యూన్ వ్యాధి. అంటే శరీర రోగనిరోధక వ్యవస్థ పొరపాటున తన ఆరోగ్యకరమైన కణాలపైనే దాడి చేయడం. ముఖ్యంగా కీళ్ల చుట్టూ ఉండే పొరపై ప్రభావం చూపి తీవ్రమైన వాపు, నొప్పి, కీళ్లు దెబ్బతినే పరిస్థితిని కలిగిస్తుంది. ఈ వ్యాధి కేవలం కీళ్లకే పరిమితం కాకుండా చర్మం, కళ్లు, ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే దీనిని దీర్ఘకాలికంగా నియంత్రించడం చాలా ముఖ్యం.

ఇక ఆస్టియోఆర్థరైటిస్ మాత్రం వయస్సు, అధిక వినియోగం లేదా కీళ్లపై ఒత్తిడి కారణంగా ఏర్పడే సమస్య. కీళ్ల మధ్య ఉండే కార్టిలేజ్ క్రమంగా దెబ్బతినడం వల్ల ఎముకలు ఒకదానికొకటి రుద్దుకోవడం మొదలవుతుంది. దీని వల్ల నొప్పి, గట్టిపడటం, కదలికల్లో ఇబ్బంది వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా మోకాళ్లు, నడుము, వెన్నెముక వంటి బరువు మోసే కీళ్లలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఈ రెండు వ్యాధుల లక్షణాల్లో కూడా స్పష్టమైన తేడాలు ఉంటాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో ఉదయం లేవగానే గంటల పాటు కీళ్లు గట్టిపడటం కనిపిస్తుంది. శరీర అలసట, స్వల్ప జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కూడా ఉండవచ్చు. ముఖ్యంగా శరీరంలోని రెండు వైపులా ఒకే కీళ్లు ప్రభావితమవడం దీని ప్రత్యేక లక్షణం. ఆస్టియోఆర్థరైటిస్‌లో అయితే కదలికలు చేసినప్పుడు నొప్పి పెరగడం, విశ్రాంతి తీసుకుంటే కొంత ఉపశమనం కలగడం కనిపిస్తుంది. కొద్దిసేపు కూర్చున్న తర్వాత లేదా నిద్రలేచినప్పుడు తాత్కాలికంగా కీళ్లు గట్టిగా అనిపిస్తాయి. అలాగే కీళ్లు కదిలించినప్పుడు రాపిడి శబ్దం వినిపించడం కూడా ఈ సమస్యలో సాధారణం. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు జన్యుపరమైన కారణాలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ధూమపానం వంటి అంశాలు కారణమవుతాయి. ఇక ఆస్టియోఆర్థరైటిస్‌కు వయస్సు, అధిక బరువు, పాత గాయాలు, ఒకే విధమైన శారీరక పనులు ఎక్కువకాలం చేయడం వంటి కారణాలు ప్రధానంగా ఉంటాయి.

వైద్యుల ప్రకారం, సరైన నిర్ధారణ చాలా ముఖ్యమని చెబుతున్నారు. ఆస్టియో ఆర్థరైటిస్‌ను సాధారణంగా ఎక్స్‌రేలు, శారీరక పరీక్షల ద్వారా గుర్తిస్తారు. కీళ్ల మధ్య ఖాళీ తగ్గడం, ఎముక పెరుగుదల వంటి లక్షణాలు కనిపిస్తాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్ నిర్ధారణకు మాత్రం రక్తపరీక్షలు కూడా అవసరం అవుతాయి. రుమటాయిడ్ ఫ్యాక్టర్, యాంటీ-సీసీపీ యాంటీబాడీలు, ఈఎస్ఆర్, సీఆర్‌పీ వంటి ఇన్‌ఫ్లమేషన్ సూచికలను పరిశీలిస్తారు. చికిత్సలో కూడా రెండింటికీ వేర్వేరు విధానాలు ఉంటాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో వ్యాధి వేగాన్ని తగ్గించేందుకు ప్రత్యేక మందులు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఔషధాలు, బయాలజికల్ థెరపీలు వాడతారు. ఆస్టియోఆర్థరైటిస్‌లో అయితే నొప్పి నియంత్రణ, ఫిజియోథెరపీ, బరువు తగ్గించడం, జీవనశైలిలో మార్పులు ముఖ్య పాత్ర పోషిస్తాయి.

అధిక స్థాయిలో కీళ్లు దెబ్బతిన్నప్పుడు జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్స అవసరం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం రోబోటిక్ సాంకేతి కతతో చేసే జాయింట్ రీప్లేస్‌మెంట్ చికిత్సలు మరింత కచ్చితత్వంతో, త్వరగా కోలుకునేలా సహాయపడుతున్నాయని పేర్కొంటున్నారు. కీళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే బరువును నియంత్రణలో ఉంచడం, తక్కువ ఒత్తిడి కలిగించే వ్యాయామాలు చేయడం, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఎక్కువసేపు ఒకే స్థితిలో ఉండకుండా తరచూ కదలికలు చేయడం కూడా కీళ్ల గట్టిపడకుండా సహాయపడుతుంది. కొన్ని వారాలకు మించి కీళ్ల నొప్పులు కొనసాగితే, వాపు, వేడి లేదా కదలికల్లో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## 'యురేనియం నిల్వలు దేశం దాటి వెళ్లకూడదు'- అమెరికా డిమాండ్‌కు ఇరాన్ తిరస్కరణ



**ఇరాన్:** అమెరికాతో దౌత్య చర్చలు నడుస్తున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కీలక నిర్ణయం తీసుకున్నారు. శుద్ధి చేసిన యురేనియంను తమకు ఇవ్వాలన్న అమెరికా డిమాండ్‌ను తిరస్కరించారు. శుద్ధి చేసిన యురేనియం నిల్వలు 'దేశం దాటి వెళ్లకూడదు' అని స్పష్టం చేశారు. ఈ మేరకు ఇరాన్ వర్గాలు చెప్పినట్లు రాయిటర్స్ పేర్కొంది. "శుద్ధి చేసిన యురేనియం నిల్వలు దేశం విడిచి వెళ్లకూడదనేది సుప్రీం లీడర్ ఆదేశం. అలాగే అంతర్గత వ్యవస్థలోనూ ఏకాభిప్రాయం కుదిరింది." అని ఇరాన్?కు చెందిన నేతలు పేర్కొన్నారు. శుద్ధి చేసిన యురేనియంపై నియంత్రణను వదులుకుని, దానిని విదేశాలకు పంపడం దేశీయ భద్రతను తీవ్రంగా దెబ్బతీస్తుందని తెలిపారు. భవిష్యత్తులో అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చొరబాట్లకు దారి తీస్తుందని, దేశాన్ని మరింత బలహీనపరుస్తుందని చెప్పారు. ఇరాన్ రాజ్యాంగ చట్రం ప్రకారం, అన్ని కీలకమైన ప్రభుత్వ విధానాలపై సుప్రీం లీడర్‌కు అంతిమ అధికారం ఉంటుందని రాయిటర్స్ నివేదించింది. "ఇరాన్ రాజకీయ వర్గాల్లో విస్తృతమైన సందేహాలు నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా క్రియాశీల యుద్ధంలో ఈ తాత్కాలిక విరామంపై చాలా మంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అమెరికా వైమానిక దాడులను తిరిగి ప్రారంభించే ముందు ఒక తప్పుడు భద్రతా భావాన్ని కలిగించేందుకు పన్నిన వ్యూహాత్మక మోసంగా భావిస్తున్నారు." అని ఇరాన్ నేతలు పేర్కొన్నట్లు రాయిటర్స్ పేర్కొంది. అటు వీరి వ్యాఖ్యలకు బలం చేకూరుస్తూ ఇరాన్ శాంతి చర్చల ప్రధాన మధ్యవర్తి మహమ్మద్ బాకర్ ఖాలిబాఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రువు స్పష్టమైన, రహస్య ఎత్తుగడలు తమకు అర్థం అవుతున్నాయన్నారు. అమెరికా సైన్యం కొత్త దాడులకు చురుకుగా పునాది వేస్తోందని స్పష్టంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. మరోవైపు అణ్వాయుధ తయారీకి అవసరమైన కీలక శుద్ధి చేసిన యురేనియం నిల్వలను ఇస్లామిక్ రిపబ్లిక్ నుంచి పూర్తిగా వెలికితీస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో ఇజ్రాయెల్‌కు హామీ ఇచ్చారు. అదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కూడా ఇదే దృఢమైన వైఖరిని కొనసాగిస్తున్నారు. శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ నుంచి పూర్తిగా తొలగించే వరకు, ఇందుకు టెహ్రాన్ అంగీకరించే వరకు తాను ఘర్షణలకు ముగింపు పలకబోనని స్పష్టం చేశారు.

# డుమ్మా కొట్టే సర్కారీ డాక్టర్ల 'ఆట'కట్టు

## సర్కారీ డాక్టర్ల 'ఆట'కట్టు..



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఏళ్ల తరబడి అదే స్థలంలో నివాసం ఉంటున్నా రిజస్ట్రేషన్లు జరగక ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వెబ్‌ల్యాండ్‌లో గ్రామకంఠంగా నమోదై.. ఇంటిపన్ను లేదా ఖాళీస్థలం పన్ను రశీదులు ఉంటే సంబంధిత ఆస్తికి రిజిస్ట్రేషన్ చేయాలని రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదేశాలు జారీ చేసింది. అవి నిషేధిత జాబితాలో ఉన్నా, లేకున్నా పక్రియ పూర్తికి అవకాశం కల్పించింది. ఆధారాలు, పత్రాల్లేని వాటికి స్వీయ ధ్రువీకరణతో రిజిస్ట్రేషన్లు చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు తొలగనున్నాయి. జిల్లాలో లక్షలాది మందికి లబ్ధి కలుగనుంది. జిల్లాలో 912 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో నరసన్నపేట, టెక్కలి, సోంపేట, పాతపట్నం, కోటబొమ్మాళి తదితర పట్టణాలు మేజర్ పంచాయతీలుగా కొనసాగుతున్నాయి. ప్రతి పంచాయతీ పరిధిలో ఒక సర్వేనెంబరుతో ఎకరా నుంచి 50 ఎకరాలకుపైగా భూమి ఉంటోంది. జిల్లాలో 5వేల ఎకరాలకుపైగా రెవెన్యూ రికార్డుల్లో గ్రామకంఠం భూములుగా నమోదై ఉన్నాయి. వీటికి సరైన పత్రాల్లేవు. తరతరాలుగా భూమి చేతుల్లో ఉన్నా ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు జరగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. క్రయవిక్రయాలు జరగక అత్యవసర సమయాల్లో మరింత అవస్థలు పడేవారు. గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్ విషయంలో సబ్‌రిజిస్ట్రార్లు పలు కొర్రీలు వేసేవారు. తాజాగా ప్రభుత్వ ఉత్వర్వులతో గ్రామకంఠం భూముల రిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు తొలగనున్నాయని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖాళీస్థలాలు, ఆస్తులు వెబ్‌ల్యాండ్‌లో గ్రామకంఠంగా నమోదైన సర్వేనెంబరు.. 22ఎ కింద ప్రభుత్వ నిషేధిత భూమలు జాబితాలో ఉందా? లేదా అనే దాంతో సంబంధం లేకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ పూర్తిచేయనున్నారు. గ్రామకంఠం సర్వేనెంబరులో సదరు ఆస్తి లేదా ఖాళీస్థలం భాగమనే లింక్ డాక్యుమెంట్లు ఉన్నా సరిపోతుంది. గృహాలు, భవనాలకు లింక్ డాక్యుమెంట్లు లేకపోయినా, స్థానిక సంస్థలు జారీ చేసిన ఇంటిపన్ను రశీదు ఉంటే.. అంగీకరించి రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇక పంచాయతీల్లో ఖాళీ స్థలాలకు పన్ను ఉండదు. అలాంటి ఖాళీస్థలాలు కూడా స్వీయధ్రువీకరణపత్రంతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చును. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో ఎక్కువగా వారసత్వంగా వచ్చినవి ఉన్నాయి. వీటికి ఎటువంటి లింక్‌డాక్యుమెంట్లు, ఇతర పత్రాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటి విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఖాళీ స్థలానికి పన్ను రశీదులను పరిగణలోకి తీసుకోవాలని.. వీటికి అదనంగా 2023 మార్చి 31లో ఇచ్చిన సర్క్యులర్‌లోని సూచనలకు అనుగుణంగా తగిన ధ్రువీకరణ రికార్డులను పరిశీలించి రిజిస్ట?ట్రషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. వారసత్వంగా సదరు ఆస్తి ఎలా వచ్చింది. 22ఏ సదరు ఆస్తి లేదని, ఆస్తి తన స్వాధీనంలో ఉండి అనుభవిస్తున్నానని, ఎటువంటి వివాదాలు లేవని, ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి రెవెన్యూ ఇతర అధికారులు నుంచి సర్టిఫికెట్లు తీసుకురావాలని ఒత్తిడిచేయవద్దని, గతంలో జారీ చేసిన మార్గదర్శికాలు పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.




## చెన్నై సూపర్ కింగ్స్‌పై

# గుజరాత్ టైటాన్స్ విజయం



ఐపీఎల్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ అవుట్ కాగా.. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్-1 బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకుంది. మిణుకుమిణుకుమంటున్న ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలబట్టుకోవాలంటే తప్పనిసరిగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో చెన్నై 89 పరుగుల తేడాతో గుజరాత్ చేతిలో చిత్తుగా ఓడింది. తొలుత టైటాన్స్ 20 ఓవర్లలో 229/4 స్కోరు చేసింది. సాయి సుదర్శన్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లతో 84), శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 64), బట్లర్ (27 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 57 నాటౌట్) అర్ధ శతకాలు సాధించారు. ముకేశ్, స్పెన్సర్ జాన్సన్, అన్షుల్ కాంబోజ్ తలో వికెట్ దక్కించుకొన్నారు. ఛేదనలో చెన్నై 13.4 ఓవర్లలో 140 పరుగులకే కుప్పకూలింది. శివం దూబే (47), మాథ్యూ షార్ట్ (24) మినహా మిగతా బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. సిరాజ్, రషీద్, రబాడ తలో 3 వికెట్లు పడగొట్టారు. సిరాజ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

భారీ ఛేదనలో సిరాజ్ నిప్పులు చెరగడంతో.. పవర్‌ప్లేలోనే నాలుగు టాపార్డర్ వికెట్లు చేజార్చుకొన్న చెన్నై ఏదశలోనూ మ్యాచ్‌లోకి రాలేక పోయింది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ శాంసన్ (0)ను డకౌట్ చేసిన సిరాజ్.. మూడో ఓవర్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (16), ఉర్విల్ పటేల్ (0)ను పెవిలియన్ చేర్చాడు. ఆరో ఓవర్‌లో షార్ట్‌ను రబాడ వెనక్కిపంపడంతో.. పవర్‌ప్లేను చెన్నై 58/4తో ముగించింది. కార్తీక్ శర్మ (19)ను గిల్ రనౌట్ చేశాడు. ఈ దశలో బ్రెవిస్ (8)తో కలసి దూబే ఆరో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. 9వ ఓవర్‌లో అర్షద్ బౌలింగ్‌లో 6,4,4 బాదిన దూబే.. ఆ తర్వాతి ఓవర్‌లో రెండు సిక్స్‌లు, ఫోర్‌తో 18 పరుగులు రాబట్టాడు. అయితే, ధాటిగా ఆడుతున్న దూబేను రషీద్ క్యాచవుట్ చేయడంతో.. చెన్నై పరాజయం ఖరారైంది. కాంబోజ్ (19), బ్రెవేస్‌ను కూడా రషీద్ వెనక్కిపంపగా.. నూర్ (1), స్పెన్సర్ (0)ను అవుట్ చేసిన రబాడ లాంఛనాన్ని పూర్తి చేశాడు. టాపార్డర్ బ్యాటర్లు సుదర్శన్, గిల్, బట్లర్ దుమ్మురేపడంతో.. గుజరాత్ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్‌కు ఓపెనర్లు సుదర్శన్, గిల్ శుభారంభాన్ని అందించారు. పసలేని చెన్నై బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న వీరిద్దరూ.. తొలి వికెట్‌కు 125 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ట పునాది వేశారు. పవర్‌ప్లేలో గిల్ బౌండ్రీలతో దూకుడు ప్రదర్శించగా.. సాయి చక్కని సహకారం అందించడంతో స్కోరు బోర్డు దూసుకెళ్లింది. ఫోర్‌తో ఖాతా తెరిచిన గిల్.. ఆ తర్వాత మరో రెండు బౌండ్రీలతో జోరు చూపాడు. క్రమంగా సుదర్శన్ కూడా తన కెప్టెన్‌ను అనుసరించాడు. ఇక, ఆరో ఓవర్‌లో సాయి ఫోర్ కొట్టగా.. గిల్ తొలి సిక్స్ బాదడంతో గుజరాత్ 62/0తో నిలిచింది. మధ్య ఓవర్లలో కూడా వీరిద్దరూ ఇదే జోరును కొనసాగించడంతో.. చెన్నై బౌలర్లకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. ఏడో ఓవర్‌లో నూర్ బౌలింగ్‌లో మరో రెండు సిక్స్‌లు కొట్టిన శుభ్‌మన్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. అనంతరం 6,4,4తో చెలరేగిన సాయి.. టీమ్ స్కోరును సెంచరీ మార్క్ దాటించాడు.

ఈ క్రమంలో 12వ ఓవర్‌లో సింగిల్‌తో సుదర్శన్ కూడా హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో గిల్‌ను క్యాచవుట్ చేసిన స్పెన్సర్.. ఎట్టకేలకు జట్టుకు బ్రేక్ అందించాడు. వన్‌డౌన్‌లో వచ్చిన బట్లర్, సుదర్శన్‌తో కలిసి ధాటిగా ఆడుతూ రెండో వికెట్‌కు 82 పరుగులు జోడించడంతో.. స్కోరు వేగం ఎక్కడా తగ్గలేదు. ఎదుర్కొన్న తొలి బంతినే బౌండ్రీకి తరలించిన బట్లర్.. 14వ ఓవర్‌లో నూర్ బౌలింగ్ మరో రెండు సిక్స్‌లతో 22 పరుగులు రాబట్టాడు. కానీ, 19వ ఓవర్‌లో కాంబోజ్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన సుదర్శన్.. ఆ తర్వాతి బంతికి పెవిలియన్ చేరాడు. రాహుల్ తెవాటియా (0)ను రుతురాజ్ రనౌట్ చేసినా.. బట్లర్ రెండు వరుస బౌండ్రీలతో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు.


## విరాట్ రికార్డు బ్రేక్ చేసిన శుభ్‌మన్ గిల్



ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్ 89 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని సాధించింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో గిల్ కేవలం 37 బంతుల్లోనే 7 ఫోర్లు, 3 సిక్స్‌ర్లతో 64 పరుగులు చేశాడు. ఈ క్రమంలో గిల్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో గిల్ 64 పరుగులు చేయడంతో ఈ ఏడాది సీజన్‌లో 600 పరుగుల మైలు రాయిని దాటేశాడు. కెప్టెన్‌గా గిల్ ఒకే సీజన్‌లో 600 పరుగులను పూర్తి చేసుకోవడం ఇది రెండో సారి. ఐపీఎల్ చరిత్రలో 27 ఏళ్ల వయస్సులోపు కెప్టెన్‌గా ఒకటి కంటే ఎక్కువ సీజన్లలో 600కు పైగా పరుగులు చేసిన తొలి ప్లేయర్‌గా గిల్ నిలిచాడు. గతంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్‌గా ఉన్న విరాట్ కోహ్లీ 27 ఏళ్ల వయస్సు లోపు కేవలం ఒక్క సీజన్‌లో మాత్రం ఈ ఫీట్ సాధించాడు. తాజా మ్యాచ్‌తో కోహ్లీ రికార్డును గిల్ బ్రేక్ చేశాడు. అదేవిధంగా వరుస సీజన్లలో 600కు పైగా పరుగులు చేసిన అతి పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. గతంలో ఈ రికార్డ్ కేఎల్ రాహుల్ పేరిట ఉండేది. అతడు 29 ఏళ్ల వయసులోలో ఈ ఫీట్ సాధించాడు. 27 ఏళ్లు నిండకముందే ఒక ఆటగాడిగా ఐపీఎల్‌లో మూడు వేర్వేరు సీజన్లలో 600 ప్లస్ పరుగులు సాధించిన ఏకైక క్రికెటర్‌గా గిల్ చరిత్ర సృష్టించాడు




# నెం.1 కావడమే లక్ష్యం: రామ్ చరణ్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రాజకీయ ప్రవేశంపై వస్తున్న ఊహాగానాలకు స్పష్టత ఇచ్చారు. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని, సినిమా రంగంలో అగ్రస్థానానికి చేరడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. "అభిమానులు మిమ్మల్ని సీఎంగా చూడాలనుకుంటున్నారు, మీరు రాజకీయాల్లోకి వస్తారా?" అన్న ప్రశ్నకు చరణ్ బదులిస్తూ.. "రెండు పడవలపై ప్రయాణం చేయాలనుకోవడం లేదు. నా పూర్తి దృష్టి నటనపైనే ఉంది... నటనా రంగంలో మేటిగా నిలవడంపైనే నా దృష్టంతా!" అని అన్నారు. తన కొత్త సినిమా 'పెద్ది' గురించి మాట్లాడుతూ, ఇది తన కెరీర్‌లో ఎంతో నిజాయతీగా చేసిన చిత్రమని తెలిపారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో, తన అస్తిత్వాన్ని వెతుక్కునే 'పెద్ది' అనే యువకుడిగా కనిపిస్తానని వివరించారు. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడ్డానని చెప్పారు. క్రీడా నేపథ్య డ్రామాగా వస్తున్న ఈ సినిమా తప్పకుండా ఆకట్టుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రిస్కీ షాట్‌లలో డూప్‌ల సహాయం లేకుండా నటించడానికే ఇష్టపడతానని, తన తండ్రి చిరంజీవి 71 ఏళ్ల వయసులో కూడా స్టంట్స్ చేస్తున్నారని, అలాంటి సన్నివేశాలు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతాయని రామ్ చరణ్ పేర్కొన్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహించిన 'పెద్ది' చిత్రం జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# చిరంజీవి సినిమాలో 'అనస్వర రాజన్'



ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరిని అదృష్టం వరిస్తుందో చెప్పడం చాలా కష్టం. కొంతమందికి వరుస విజయాలు అందుకున్నా కొన్నిసార్లు ఛాన్స్‌లు రావు. మరికొంత మందికి ఒక్క సినిమా చేసినా మెగా ఛాన్స్ వచ్చేస్తోంది. తాజాగా మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ రెండో కేటగిరిలో ఉందని చెప్పొచ్చు. చిన్న చిన్న పాత్రలు చేస్తూ కెరీర్‌ను ప్రారంభించిన ఈ బ్యూటీ ప్రస్తుతం స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతోంది.

ఛాంపియన్ సినిమాతో అనస్వర తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమా గతేడాది రిలీజ్ అయ్యి మిక్స్ టాక్ ను అందుకుంది. సినిమా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయినా అనస్వర న్యాచురల్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అమ్మడికి టాలీవుడ్ లో మంచి భవిష్యత్ ఉంటుందని జోస్యం కూడా చెప్పారు. ఇప్పుడు ఆ జోస్యం నిజమైంది. ఈ చిన్నది తన రెండో సినిమానే మెగాస్టార్ చిరంజీవితో చేస్తోంది.

మెగాస్టార్ చిరంజీవి- బాబీ కొల్లి కాంబోలో వస్తోన్న చిత్రం మెగా 158. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం తాజాగా పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. ఈ ప్రారంభోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం విశేషం. చిరంజీవిపై చిత్రీకరించిన ప్రారంభ సన్నివే శానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టారు. ఇక ఈ చిత్రంలో అనస్వర ఒక కీలక పాత్రలో నటించబోతోంది. అందుతున్న సమాచారం ప్రకారం చిరుకు కూతురిగా ఆమె నటిస్తోందని తెలుస్తోంది. మెగాస్టార్ సినిమాలో ఒక చిన్న పాత్ర చేసినా అది ఈ తరం నటీనటులకు అచీవ్‌మెంట్ అని చెప్పొచ్చు. ఎన్నోఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న హీరోయిన్లకు రాని మెగా ఛాన్స్ రెండో సినిమాకే ఈ మలయాళ బ్యూటీకి దక్కడం నిజంగా ఆమె అదృష్టమని నెటిజన్స్ అంటున్నారు. ఏది ఏమైనా అనస్వర నక్కతోక తొక్కింది అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరి ఈ సినిమాతో అమ్మడు ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.






# మిరాయ్.. సీక్వెల్‌లో రానా..



తక్కువ టైమ్‌లోనే పాన్ ఇండియా లెవెల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న యంగ్ హీరో.. తేజ సజ్జా టాలీవుడ్ టాప్ హీరోలకు సైతం సాధ్యం కాని రీతిలో, విభిన్నమైన కథలను ఎంచుకుంటూ వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు ఈ యంగ్ స్టార్. జాంబీ రెడ్డితో మొదలైన ఇతని సంచలనం, హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా వైడ్‌గా మారుమ్రోగింది. ఇక గతేడాది విడుదలైన మిరాయ్ సినిమా కూడా ఊహించని విధంగా వంద కోట్ల క్లబ్‌లో చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో వచ్చిన ఈ విజువల్ వండర్, బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ సంచలన చిత్రానికి సంబంధించిన సీక్వెల్ పనులు చాలా సైలెంట్‌గా మొదలైపోయాయట..! సాధారణంగా ఒక సినిమా హిట్ అయితే, దానికి సీక్వెల్ తీయడానికి చాలా టైమ్ తీసుకుంటారు. కానీ మిరాయ్ టీమ్ మాత్రం అస్సలు ఆలస్యం చేయడం లేదు. ఈ ఏడాది ఇప్పటికే ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో జై హనుమాన్ చిత్రాన్ని పట్టాలెక్కించిన తేజ సజ్జా, ఇప్పుడు అంతే వేగంగా మిరాయ్ సీక్వెల్‌ను కూడా లైన్లో పెట్టేసాడు. దీనికి గల ముఖ్య కారణం.. ఈ సినిమాకు అవసరమయ్యే భారీ విజువల్ ఎఫెక్ట్స్. ప్రస్తుత రోజుల్లో గ్రాఫిక్స్, సీజీ వర్క్‌కు చాలా ఎక్కువ సమయం పడుతోంది. అందుకే మూవీ టీమ్ ఒక స్మార్ట్ డెసిషన్ తీసుకుంది. సినిమాలోని అత్యంత కీలకమైన సీజీ షాట్స్, స్పెషల్ ఎఫెక్ట్స్‌కు సంబంధించిన రా ఫుటేజ్‌ను ఇప్పుడే చిత్రీకరించడం ప్రారంభించారట. ఇలా చేయడం వల్ల పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎలాంటి ఆలస్యం లేకుండా, అనుకున్న సమయానికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావచ్చని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సీక్వెల్‌లో అసలైన హైలైట్ ఏంటో తెలుసా..? బాహుబలిలో భళ్లాలదేవగా గడగడలాడించిన దగ్గుబాటి రానా ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంట్రీ ఇస్తున్నాడు. మిరాయ్ క్లైమాక్స్‌లోనే రానాకు సంబంధించిన కొన్ని స్పెషల్ సీన్స్‌ను రిలీజ్ చేసి, కావాల్సిన హైప్‌ను తీసుకొచ్చారు. గత కొంతకాలంగా టాలీవుడ్ సినిమాలకు కాస్త దూరంగా ఉంటున్న రానా.. ఈ పవర్‌ఫుల్ రోల్‌తో మళ్లీ బాక్సాఫీస్ దగ్గర గట్టి కంబ్యాక్ ఇస్తాడని ఫ్యాన్స్ ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. రానా స్క్రీన్ ప్రెజెన్స్, తేజ సజ్జా ఎనర్జీ తోడైతే థియేటర్లలో పూనకాలు గ్యారెంటీ. ఈ ఒక్క అప్‌డేట్‌తోనే 'మిరాయ్' సీక్వెల్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కేవలం మిరాయ్ సీక్వెల్ మాత్రమే కాదు.. తేజ సజ్జా ఖాతాలో జాంబీ రెడ్డి సీక్వెల్ కూడా లైన్లో ఉంది. అంటే రాబోయే రోజుల్లో తేజ సజ్జా నుంచి వరుసగా క్రేజీ సీక్వెల్స్ రాబోతున్నాయన్నమాట. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పై నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాలను నిర్మిస్తున్నారు. హాలీవుడ్ రేంజ్ క్వాలిటీతో ఈ చిత్రాలను రూపొందించడానికి పీపుల్ మీడియా సంస్థ భారీగా ఖర్చు చేస్తోంది.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem, VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**